ఇండోర్ తరహాలో.. గ్రేటర్‌కు దిద్దుబాటు

- సీఆర్ఎంపీ రోడ్ల నిర్వహణపై సీఎం అసంతృప్తి
- నిర్లక్ష్యంగా వ్యవహరించే ఏజెన్సీలను ఉపేక్షించొద్దు
- రోడ్లతో పాటు చెత్త సేకరణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి
- లొసుగులను సవరించుకుని ఆదాయాన్ని పెంచుకోవాలి
- హైదరాబాద్ అభివృద్ధిపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

సిటీబ్యూరో, సెప్టెంబరు 13(నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌ను ఇండోర్ తరహాలో అద్భుతమైన క్లీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మున్సిపల్ విభాగపు అధికారులు ఇండోర్‌కు వెళ్లి అధ్యయనం చేయాలని అన్నారు. అక్కడ అనుసరిస్తున్న విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించాలని సీఎం చెప్పారు. ఏయే ఏజెన్సీలు, స్వచ్ఛంద సంస్థలు అక్కడ పనుల్లో పాలుపంచుకున్నాయో తెలుసుకొని చర్చలు జరపాలని, వీలైతే వారిని భాగస్వాములను చేయాలని చెప్పారు. క్లీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు ఇండోర్ కార్పొరేషన్ ఆదాయ వనరులెలా సమీకరిస్తుందనే వివరాలు కూడా తెలుసుకోవాలని సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్ అభివృద్ధితో పాటు జీహెచ్ఎంసీ పరిధిలో రోడ్లు, ఫుట్ పాత్‌ల అభివృద్ధి, క్లీనింగ్, ఇతర పనుల్లో పురోగతిపై ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సచివాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి సారించండి

రోడ్లతో పాటు చెత్త సేకరణపై జీహెచ్ఎంసీపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సీఎం అన్నారు. ప్రతి ఇంటి నుంచి నిత్యం చెత్త సేకరించేలా పర్యవేక్షణ ఉండాలన్నారు. అవసరమైతే జీఐఎస్, క్యూ ఆర్ స్కాన్ లాంటి కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని సీఎం చెప్పారు. జీహెచ్ఎంసీలో నిరంతరం జరిగే పనులకు ఆర్థిక ఇబ్బంది లేకుండా నిధుల సమీకరణకు కూడా స్పష్టమైన ప్రణాళికలు చేసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఇప్పుడున్న బకాయిల చెల్లింపులకు అవసరమైన నిధులను తాత్కాలికంగా సర్దుబాటు చేసుకోవాలని చెప్పారు. ఆదాయం పెంచుకునే మార్గాలతో పాటు, ఇప్పుడున్న లొసుగులను సవరించుకోవాలని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ ఆస్తుల నుంచి వచ్చే అద్దెలు, అడ్వర్టయిజ్మెంట్లు, హోర్డింగుల ద్వారా వచ్చే ఆదాయం వస్తుందా? లేదా అని పర్యవేక్షించాలన్నారు.

పనులు చేయని కాంట్రాక్టర్ల లిస్టివ్వండి

హైదరాబాద్‌లో ఐదేండ్ల కిందట కాంప్రిహెన్సివ్ రోడ్ మెయింటెనెన్స్ ప్రోగ్రాం కింద 811 కిలో మీటర్ల రోడ్ల నిర్మాణం చేపట్టారని, వాటి నిర్వహణను మాత్రం పట్టించుకోవటం లేదని ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది డిసెంబర్‌తో కాంట్రాక్టు గడువు ముగిసిపోతుందని, అందుకే రోడ్ల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఏజెన్సీలను ఉపేక్షించవద్దని ముఖ్యమంత్రి ఆదేశించారు. గడువులోగా అన్ని రోడ్ల పనులను పర్యవేక్షించి, వెంటనే బాగు చేయించాలని చెప్పారు. పనులు చేయని కాంట్రాక్టర్లకు సంబంధించి 15 రోజుల్లోగా తనకు పూర్తి నివేదికను అందించాలని సీఎం ఆదేశించారు. తప్పుడు నివేదికలు ఇస్తే అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మూసీ బాధితులకు పునరావాసం..

మూసీ రివర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. మూసీ పరివాహక ప్రాంతంలో సేకరించే స్థలాల్లో ఉన్న నివాసితులకు పునరావాసం కల్పించాలని స్పష్టం చేశారు. తమకు అన్యాయం జరిగిందని నిర్వాసితులు బాధ పడకుండా, వారికి భరోసా కల్పించాలని చెప్పారు. పునరావాస కాలనీలు ఎక్కడెక్కడ ఉన్నాయి, అక్కడ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు ఉన్నాయా? లేదా అధికారులు స్వయంగా వెళ్లి పరిశీలించాలని సీఎం ఆదేశించారు. చర్లపల్లి రైల్వే స్టేషన్ అధునీకరిస్తున్నందున, పరిసర ప్రాంతాల నుంచి స్టేషన్‌కు చేరుకునే అప్రోచ్ రోడ్లను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. పరిసరాల్లో ఉన్న అటవీ శాఖ భూమిని, పరిశ్రమల విభాగం భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని సూచించారు. అక్కడున్న పరిశ్రమలను మరో చోటికి తరలించాలని చెప్పారు. స్టేషన్ ముందు పార్కింగ్, కమర్షియల్ జంక్షన్ కు వీలుగా అప్రోచ్ రోడ్లు డిజైన్ చేసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు.

జీహెచ్ఎంసీ గుర్తింపు సంఘం ఎన్నికలను వెంటనే నిర్వహించాలి

తెలంగాణ రాష్ట్ర మినిమమ్ వేజెస్ బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్ నేతృత్వంలో కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ జి.సునీతను కలిసి సీక్రెట్ బ్యాలెట్ ద్వారా గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆదిల్ షరీఫ్ వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ 2018 సంవత్సరంలో జీహెచ్ఎంసీ గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయని, కాల పరిమితి ముగిసి నాలుగేళ్లు పూర్తైనా ఇప్పటి వరకు ఎన్నికలు నిర్వహించక పోవడం విచారకరమన్నారు. – *అబిడ్స్, సెప్టెంబర్ 13*

ఆపదలో ఉన్నవారిని ఆదుకుందాం

- గ్రేటర్ ఈస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ టి.నరసింహారావు

వాహనాన్ని ప్రారంభిస్తున్న నరసింహారావు, గ్రేటర్ ఈస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ఆర్కేపురం, సెప్టెంబర్ 13: ఆపదలో ఉన్నవారిని ఆదుకుందాం, ఆదుకోవడం అనేది మనసున్న ప్రతి ఒక్కరి బాధ్యత అని గ్రేటర్ ఈస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ టి.నరసింహారావు అన్నారు. ఖమ్మం, ములుగు, నల్గొండ వరద బాధితులకు పంపిణీ చేసేందుకు రూ.20 లక్షల విలువైన నిత్యావసర సరుకులు, దుస్తులు, చిన్నారుల ఆట వస్తువులను గ్రేటర్ ఈస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్కేపురం డివిజన్ వాసవీ కాలనీలోని అష్టలక్ష్మి దేవాలయం ప్రాంగణం నుంచి డీసీఎంలో తరలించే వాహనానికి నరసింహారావు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రేటర్ ఈస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మారం సతీశ్, శ్యామ్ కిరణ్, పాండు రంగా రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, సుధాకర్, విక్రమ్ రెడ్డి, రవీంద్ర కుమార్, ఉపేందర్, మొర్రిశెట్టి శ్రీనివాస్, విక్రమ్, మేఘన, అక్షయ్, రతన్, వాసు, అభినవ్, మహేశ్, బద్రినాథ్, రోహిల్, గౌరిశెట్టి శ్రీనివాస్, అంజయ్య, జగన్, చిలుక ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ్ కమిటీని ఉపసంహరించుకోవాలి

- ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి

అభివాదం చెబుతున్న ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నేతలు

రవీంద్రభారతి, సెప్టెంబర్ 13: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అమలు కోసం తెలంగాణ ప్రభుత్వం నియమించిన మంత్రుల కమిటీని వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ జి.చెన్నయ్య, కో-కన్వీనర్లు బూర్గుల వెంకటేశ్వర్లు, కరణం కిషన్, బత్తుల రాంప్రసాద్, గోపోజు రమేశ్‌లు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలుకు మంత్రుల కమిటీ ఏర్పాటు చేయడాన్ని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఏకపక్షంగా మంత్రుల కమిటీతో తెలంగాణలో మాల, మాల అనుబంధ కులాలకు ఏ మాత్రం న్యాయం జరగదన్నారు. ఏ ఒక్క మాల మంత్రి లేకుండా కమిటీని ఎలా నియమిస్తారన్నారు.ఇందంతా మాలల, మాల ఉప కులాలను మోసం చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కంకణం కట్టుకున్నదన్నారు. మంత్ర కమిటీని రద్దు చేసి సిట్టింగ్ న్యాయమూర్తి నేతృత్వంలో కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బేరా బాలకృష్ణ, జంగా శ్రీనివాస్ పాల్గొన్నారు.

5జీ, 6జీ హ్యాకథాన్..

విజేతలకు రూ.17.25 ప్రైజ్ మనీ, టీ హబ్‌లో 26, 27వ తేదీల్లో నిర్వహణ

సిటీబ్యూరో, సెప్టెంబర్ 14(నమస్తే తెలంగాణ): టెలీ కమ్యూనికేషన్ టెక్నాలజీలో ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు టీ హబ్ ఆధ్వర్యంలో 5జీ, 6జీ హ్యాకథాన్‌ను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. వరల్డ్ టెలీ కమ్యూనికేషన్ స్టాండర్డైజేషన్ అసెంబ్లీ (డబ్ల్యుటీఎస్) అవుట్‌రీచ్ ప్రోగ్రామ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వ సమాచార శాఖ, డిపార్టుమెంట్ ఆఫ్ టెలీకాం, భారత్ 6జీ అలయెన్స్‌లతో కలిసి 5జీ, 6జీ హ్యాకథాన్‌ను నిర్వహిస్తున్నామని, ఈ నెల 15వ తేదీ లోగా ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఈ నెల 26, 27వ తేదీల్లో హ్యాకథాన్ ఉంటుందని, మరిన్ని వివరాలకు ఈ కింది లింకు(https://bit.ly/3zcAoe3)లో సంప్రదించాలని తెలిపారు.

మహిళలకు ఆర్థిక చేయూత: జీహెచ్ఎంసీ

కుట్టు మిషన్ కేంద్రం ప్రారంభోత్సవం

సిటీబ్యూరో, సెప్టెంబరు 13(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలకు ఆర్థిక, సామాజికంగా ప్రగతి సాధించే దిశగా ముందుకు పోతున్నట్లు మేయర్ విజయలక్ష్మి తెలిపారు. బాలానగర్‌కు చెందిన సహారా గ్రూప్ సభ్యులకు కుట్టు మిషన్ కేంద్రాన్ని శుక్రవారం ఏర్పాటు చేసి రూ.4 లక్షల ఆర్థిక సహాయాన్ని ఆమె పంపిణీ చేశారు. గ్రేటర్‌లో సుమారు 47,960 స్వయం సహాయక సంఘాలలో 4, 47,631 మహిళలు సభ్యులుగా ఉన్నారని మేయర్ పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి 7000 ఎంటర్‌ప్రైజెస్‌లను గ్రూపులకు, వ్యక్తిగత మహిళలకు మొత్తం రూ. 410 కోట్ల ఈ ఆర్థిక సంవత్సరంలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మైక్రో క్రెడిట్ ద్వారా ఇప్పటికే 1718 గ్రూపులకు రూ.186.25 కోట్ల ఆర్థిక సహాయం అందజేసినట్లు మేయర్ తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (యూసీడీ) చంద్రకాంత్ రెడ్డి, జోనల్ కమిషనర్ రవి కిరణ్, యూసీడీ అధికారులు, సహారా గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లి ప్రయాణికులకు ఇబ్బందులుండొద్దు

- క్షేత్రస్థాయి పర్యటనలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

సిటీబ్యూరో, సెప్టెంబరు 13(నమస్తే తెలంగాణ): చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు వెళ్లే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. కమిషనర్ కాప్రా సర్కిల్ చర్లపల్లిలో జోనల్ కమిషనర్ టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులతో శుక్రవారం కలిసి పరిశీలన చేశారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు అనుసంధానంగా ఉన్న అన్ని రోడ్లను కమిషనర్ పరిశీలించారు. ఇప్పటికే దెబ్బతిన్న రోడ్లను వెడల్పు చేసి రోడ్డు వేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆటవీ శాఖ నుంచి వెడల్పు రహదారి ప్రతిపాదించారు. టెర్మినల్‌కు చుట్టూ పటిష్టమైన రహదారి ఏర్పాటుకు అవసరమైన భూమిని సేకరించాలన్నారు. టెర్మినల్ చుట్టూ ఉన్న అప్రోచ్ రోడ్డు టీజీఐఐసీకి సంబంధించిన భూమి ఉన్నందున వారు సహకారంతో టెర్మినల్ చుట్టూ రోడ్డు మార్గం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ వెంట ఎల్బీ నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్ఈ అశోక్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి

ఆర్కేపురం, సెప్టెంబర్ 13: దేశ వ్యాప్తంగా వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న రాజీ చేయగలిగిన కేసుల పరిష్కారం కోసం ఈ నెల 14వ తేదీన (శనివారం) జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని హైకోర్టు న్యాయవాది, టీపీసీసీ రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా న్యాయ సేవల అధికారాల చట్టం – 1987ను సవరించి జాతీయ న్యాయ సేవల అథారటీ ఆధ్వర్యంలో వివిధ కోర్టులు, ట్రిబ్యునల్స్‌లో జాతీయ లోక్ అదాలత్‌లు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రతి సంవత్సరంలో నాలుగుసార్లు జాతీయ లోక్ అదాలత్‌లను నిర్వహించడం అనవాయితీగా వస్తుందన్నారు. గత మూడేళ్లలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ వల్ల 13 కోట్ల 57 లక్షలకు పైగా కేసులు పరిష్కారమవడంతో పాటు మంచి ఫలితాలు వచ్చాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం, లీగల్ హ్యూమన్ రైట్స్ ఆర్‌టీఐ విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా ఎన్నికైన నూనె ప్రభాకర్‌ను సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అన్నెబోయిన మట్టయ్య, గుంట ప్రేమ్ కుమార్, మన్నెం మల్లయ్య, ప్రేమ్ కుమార్, డి.రాములు, నాగేశ్వర్ రావు, లక్ష్మయ్య, కళ్యాణ్ పాల్గొన్నారు.

నోబెల్ శాంతి గ్లోబల్ సమ్మిట్‌కు సామల వేణు

తెలుగు యూనివర్సిటీ, సెప్టెంబర్ 13: అత్యంత ప్రతిష్టాత్మకంగా మెక్సికో దేశం న్యూవో లియోన్‌లోని మోంటెర్రే నగరంలో సెప్టెంబర్ 18 నుంచి 21 వరకు జరగనున్న 19వ ప్రపంచ నోబెల్ శాంతి శిఖరాగ్ర సమావేశానికి ప్రముఖ సంఘ సేవకులు, ప్రఖ్యాత ఇంద్ర జాలికులు సామల వేణుకు ఆహ్వానం అందింది. 'ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కారానికి రూపొందించిన కార్యాచరణ, వ్యూహాలు' తదితర అంశాలే లక్ష్యంగా సమావేశం సాగనున్నది. ఇందులో ప్రపంచంలోని నోబెల్ గ్రహీతలు, శాంతి, న్యాయవాదులు సామూహికంగా పాల్గొని తమలోని జ్ఞానంతో పురోగతి మార్గాలను అన్వేషించే సదస్సుకు తెలంగాణ రాష్ట్రం నుంచి వేణు హాజరవుతున్నారు.

'వర్సిటీల కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డును రద్దు చేయాలి'



ప్రొ. కోదండరామ్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి నాయకులు

రాష్ట్రంలో యూనివర్సిటీల కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డును రద్దు చేయాలని ఓయూ విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థి నాయకులు డిమాండ్ చేస్తూ.. తార్నాకలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు నాగేశ్వరరావు, ఆర్ ఎల్ మూర్తి, కోట శ్రీనివాస్, నిజ్జన రమేశ్, సుమంత్, రవి నాయక్, సలీం పాషా, ఆశప్ప, రుక్మత్ పాషా, మల్సూర్ పాల్గొన్నారు.

– *ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 13*

మంచినీరు, సీవరేజి నిర్వహణపై ప్రత్యేక దృష్టి

- ఎయిర్ టెక్ యంత్రాలకు జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ
- సిల్ట్ కార్టింగ్ వాహనాల సమీక్షలో జల మండలి ఎండీ అశోక్ రెడ్డి

సిటీబ్యూరో, సెప్టెంబరు 13(నమస్తే తెలంగాణ): వినాయక నిమజ్జనం నేపథ్యంలో మంచినీటి సరఫరా, సీవరేజి నిర్వహణపైన ప్రత్యేక దృష్టి సారించాలని జల మండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ముందస్తు నిర్వహణ చర్యలు పూర్తి చేయాలన్నారు. ఎక్కడా సీవరేజి ఓవర్ ఫ్లో సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. ఏదైనా సీవరేజి సమస్య ఉంటే వెంటనే పరిష్కరించేందుకు ఎయిర్ టెక్ మిషిన్లు అందుబాటులో ఉంచాలని ఎండీ ఆదేశాలు జారీ చేశారు. జల మండలి ప్రధాన కార్యాలయంలో అధికారులతో రెవెన్యూ, వినాయక నిమజ్జనం తదితర అంశాలపై ఎండీ శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సిల్ట్ కార్టింగ్ వాహనాలు అందుబాటులోకి వచ్చి ఏడాది పూర్తయ్యిందని, ఇప్పటి దాకా ఆ వాహనాలు, అందులో పనిచేసే సిబ్బంది పనితీరుపై ఎండీ ఆరా తీశారు. ఇంకా వాటిని ఆధునీకరించే అవసరం ఉందా? అందులో మార్పులు, చేర్పులకు కావాల్సిన సలహాల్ని, సూచనల్ని కింది స్థాయి అధికారుల నుంచి సేకరించాలన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, రెవెన్యూ డైరెక్టర్లు, సీజీఎం, జీఎంలతో చర్చించి నివేదిక తయారు చేయాలని ఎండీ ఆదేశించారు. ఎయిర్ టెక్ పనితీరును పర్యవేక్షించడానికి జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జల మండలి అత్యవసర సమయంలో సకాలంలో నివారించడానికి ఏఎంఎస్ పద్ధతిని రూపొందించిందని, ఈ వ్యవస్థ పనితీరుపై ఎండీ వివరాలు తెలుసుకున్నారు. ఏఎంఎస్‌ను గతంలో ఉన్న వ్యవస్థలతో పోల్చి ఏది తక్కువ ఖర్చుతో ఎక్కువ పని అవుతుందో తెలుసుకోవాలన్నారు. ఈ సమీక్షలో ఈడీ మయాంక్ మిట్టల్, ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, ఆపరేషన్స్ డైరెక్టర్-2 స్వామి, ఆపరేషన్స్ డైరెక్టర్-1 విజయరావు సీజీఎం, జీఎం పాల్గొన్నారు.

గణేశ్ శోభాయాత్రకు విద్యుత్ శాఖ సిద్ధం

- సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

సిటీబ్యూరో, సెప్టెంబర్ 13(నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌లో 17న నిర్వహించిన గణనాథుల శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమం సజావుగా జరిగేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అన్ని ఏర్పాట్లు చేసిందని సీఎండీ ముషారఫ్ ఫరూఖీ అన్నారు. హుస్సేన్‌సాగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ శాఖ శుక్రవారం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను ఆయన ప్రారంభించారు. నిమజ్జనం సందర్భంగా అవసరమయ్యే విద్యుత్ అదనపు లోడ్‌కు సరిపోయేలా 500 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు 3చ, 315 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు 31, 160 కేవీఏ సామర్థ్యంతో కూడిన ట్రాన్స్‌ఫార్మర్లను 37 వరకు ఏర్పాటు చేశామని తెలిపారు. 55 కి.మీ 11 కేవీ ఎల్ టీ కేబుల్స్‌ను, పోల్స్, కండక్టర్స్‌ను ఏర్పాటు చేశామని, సూపరింటెండెంట్ ఇంజనీర్లు, డివిజనల్ ఇంజనీర్లు క్షేత్ర స్థాయిలో ఉండి పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. గణేశ్ మండప నిర్వాహకులు, ప్రజలు విద్యుత్ భద్రతా సూచనలు పాటిస్తూ ఎక్కడైనా అవాంఛనీయ పరిస్థితులు ఏర్పడితే విద్యుత్ శాఖ కంట్రోల్ రూమ్ నంబరుకు లేదా 100, 1912లకు కాల్ చేసి తెలియజేయాలని సీఎండీ ముషారఫ్ ఫరూఖీ సూచించారు.

సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం

- మేడ్చల్‌లో 34వ శాఖను ఆవిష్కరించిన సినీ నటుడు విశ్వక్ సేన్

మేడ్చల్, సెప్టెంబరు 13: తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశాలో అతి పెద్ద వస్త్ర వ్యాపార సంస్థగా వెలుగొందుతున్న సీఎంఆర్ షాపింగ్ మాల్ తన 34వ శాఖను మేడ్చల్‌లో శుక్రవారం ప్రారంభించింది. ఇందుకు సినీ హీరో విశ్వక్ సేన్ శుక్రవారం షాపింగ్ మాల్‌కు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా వస్త్ర వ్యాపార రంగంలో ప్రత్యేకంగా నిలుస్తూ ప్రజల ఆదరాభిమానాతో అగ్రగామిగా నిలిచిందన్నారు. సీఎంఆర్ అంటే కుటంబం అంతటికీ మెచ్చే కంప్లీట్ మాల్ అన్నారు. సీఎంఆర్ ఫౌండర్, చైర్మన్ మావూరి వెంకట రమణ మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రజలకు అతి తక్కువ ధరలకే వస్త్రాలు, జ్యువెల్లరీని అందించడం సీఎంఆర్ ప్రత్యేకత అన్నారు. తమ సొంత మగ్గాలపై నేయించిన వస్త్రాలను మార్కెట్‌లో మరెవ్వరూ ఇవ్వని ధరకు సీఎంఆర్ అందిస్తున్నదని తెలిపారు. సీఎంఆర్ ఎండీ మావూరి మోహన్ బాలాజీ మాట్లాడుతూ, 34వ షోరూంలను మేడ్చల్‌లో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. తమ వద్ద అందుబాటు ధరలో లక్షల్లో డిజైన్లు, వేలల్లో వెరైటీలు లభిస్తాయన్నారు. సినీ హీరో విశ్వక్ సేన్ మేడ్చల్‌కు రావడంతో పట్టణం సందడిగా మారింది. ఆయనతో సెల్ఫీలు దిగడానికి పోటీ పడ్డారు.

కబ్జాల నియంత్రణకే హైడ్రా

- మహేశ్వరంలోని చెరువులు, పార్కుల కబ్జాల జాబితాను సిద్ధం చేయండి
- మల్లాపూర్‌లో నిర్వహించిన రైతుల సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు

మంత్రి శ్రీధర్ బాబుకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

బడంగ్‌పేట, సెప్టెంబర్ 13: కబ్జాదారులను ఉక్కు పాదంతో అణిచి హైడ్రా అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మల్లాపూర్‌లో ఉన్న వైఏఆర్ గార్డెన్స్‌లో గురువారం రాత్రి నాదర్‌గుల్, కుర్మల్‌గూడ, బడంగ్‌పేట, మీర్‌పేట రైతులతో మంత్రి సమావేశమయ్యారు. రైతులు మంత్రికి వినతి పత్రాలు అందజేశారు. రైతుల సమస్యలను పారదర్శంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని ఆయన అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రభుత్వ భూములు, చెరువులు, పార్కులను పరిరక్షించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వాటిని కాపాడటానికే హైడ్రాను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి చెరువుల కబ్జాలు, పార్కుల జాబితాను సేకరించి నివేదిక అందించాలన్నారు. కబ్జాదారులు ఎంతటి వారైనా సర్వే చర్యలు తీసుకుంటామన్నారు. హైడ్రా ఎవరిని వదిలిపెట్టదన్నారు. చెరువులలో, ఎఫ్‌టీఎల్ పరిధిలో, బఫర్ జోన్ పరిధిలో ఆక్రమణలు ఉన్నట్లు తేలితే హైడ్రా తప్పకుండా చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గం ఇన్‌చార్జికి ఇచ్చిన గారి లక్ష్మారెడ్డి, అమరేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి, గోవింద్ రెడ్డి, జగన్, భాస్కర్ రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్ల సమస్యలపై వినతి

బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్ల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర అధ్యక్షులు దామోదర్ గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యుల బృందం ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును శుక్రవారం కలిసి సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. అసోసియేషన్ సలహాదారులు బి.బాల్‌రాజ్ గౌడ్, గౌరవ అధ్యక్షులు జి.విజయ కుమార్ గౌడ్, ఉపాధ్యక్షులు జి.రామకృష్ణ, పి.రాజు గౌడ్, ఎం.నరసింహ గౌడ్, కె.వెంకన్న గౌడ్, ఎస్.శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శి పల్లె నర్సింగ రావు, కోశాధికారి ఎం.